క్లుప్తంగా

పంటల నమోదు తప్పనిసరి

వత్సవాయి : రబీలో పంటలు సాగుచేసే రైతులు తప్పనిసరిగా పంటల వివరాలను నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మొక్కజొన్న, వరి, కూరగాయాలతోపాటు పండ్లతోటలు సాగు చేసే రైతులు కూడా విధిగా రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించి పంటల వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. ఇతర వివరాల కోసం గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పెనుగంచిప్రోలు: అభివృద్ధి పనులు వేగంగా చేయడంతోపాటు పనుల్లో నాణ్యత పాటించాలని శ్రీతిరుపతమ్మ ఆలయ ఈఈ వైకుంఠరావు సూచించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో సుమారుగా రూ.14 కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఆయా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో జరుగుతున్న షెడ్లు, గదుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి ఫిబ్రవరి మొదటివారంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట ఆలయ ఏఈ రాజు, సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన

నందిగామ: పట్టణ ప్రజలు సైబర్ నేరాల బారినపడి నష్టపోకుండా ఉండేందుకు మిక్ ఇంజినీరింగ్ విద్యార్థులు ఆదివారం వారికి అవగాహన కల్పించారు. మిక్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరగాళ్లు ప్రజలను ఎలా మోసం చేస్తారు.. సైబర్ నేరగాళ్ల బారినపడి నష్టపోకుండా ఉండేందుకు ఎటువంటి జాగ్రత్తలను పాటించాలని అనేఅంశాలపై నందిగామ ప్రజలకు అవగాహన కల్పించారు. మొబైల్ ఫోన్ వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు.

గానాల రామ్మూర్తి సేవలు అమూల్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విశ్వబ్రాహ్మణులను బీసీల్లో చేర్చేందుకు, వారి అభ్యున్నతికి రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి చేసిన సేవలు ఎంతో అమూల్యమైనవని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ తోలేటి శ్రీకాంత్ పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణ యువజన సంఘం నగర అధ్యక్షుడు చిట్టూరి హరీష్ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ గానాల రామ్మూర్తి జయంతి కార్యక్రమం సింగ్ నగర్ ఫ్లైఓవర్ సెంటర్ వద్ద ఆదివారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన నిర్వాహకులతో కలిసి రామ్మూర్తి చిత్రపటానికి పులమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాంత్ మాట్లాడుతూ ఆనాటి మద్రాస్, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో ఎమ్మెల్సీగా ఉన్న రావు సాహెబ్ పండిత గానాల రామ్మూర్తి ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించి విశ్వబ్రాహ్మణులందరినీ బీసీల్లో చేర్చిన మహనీయుడని కొనియాడారు. అనంతరం స్థానికులకు పండ్లు పంపిణీ చేశారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సేవా సంఘం మహిళా కార్యదర్శి ముందురి సత్యవతి, కొండూరు మోహనరావు, శ్యామ్, రమేష్, మణికంఠ పాల్గొన్నారు.

క్రికెట్ నెట్ కోర్టు ప్రారంభం



విజయవాడస్పోర్ట్స్: శాతవాహన డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన క్రికెట్ నెట్స్ కోర్టును ఆ కళాశాల కరస్పాండెంట్, జాయింట్ సెక్రటరీ ఎస్.రమాసత్యనారాయణ ఆదివారం ప్రారంభించారు. క్రికెట్ నెట్స్ నిర్వాహకుడు కె.విశ్వనాథ్ మాట్లాడుతూ పిల్లల్లో క్రికెట్ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెట్స్ ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి రెండు గంటల వరకు నెట్ కోర్టులు అందుబాటులో ఉంటాయని, వివరించారు.

భార్యపై దాడి చేసిన భర్త

పాయకాపురం(విజయవాడరూరల్): భార్యపై రుబ్బురాయితో దాడి చేసి గాయపర్చిన భర్తపై నున్న పోలీసు స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాయకాపురం రాజీవ్‌నగర్‌కు చెందిన శివకుమార్‌కి ప్రకాశం జిల్లాకు చెందిన శివపార్వతితో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. ఆటోడ్రైవరుగా పనిచేస్తున్న శివకుమార్ భార్యను తరుచూ అనుమానిస్తూ, శారీరకంగా మానసికంగా ఇబ్బందిపెడుతున్నాడు. ఈ క్రమంలోనే శనివారం రాత్రి భార్యతో గొడవ పడిన శివకుమార్ రుబ్బురాయితో తలపై దాడి చేయగా ఆమె గాయపడింది. దీంతో క్షతగాత్రురాలు శివపార్వతి తండ్రి నిమ్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంతా రామమయం

జగ్గయ్యపేట అర్బన్: అయోధ్యలో సోమవారం శ్రీరామ జన్మభూమి రామమందిరం, రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీరాముడి భక్తులు పలు కార్యక్రమాలు చేపట్టారు. అంతా రామమయం.. ఈ జగమంతా రామమయం అంటూ రాములోరి అక్షింతలు పంపిణీ చేపట్టడంతోపాటు అయోధ్యరాముని జెండాలను ఇంటింటికీ పంచుతున్నారు. పలుగ్రామాల్లో శ్రీరాముడి పేరుతో స్టిక్కర్లు అంటిస్తున్నారు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో అయోధ్య రాముని జెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

జెండాల ఆవిష్కరణ..

అయోధ్య రాముని చిత్రాలతో రూపొందించిన జెండాలను ప్రభుత్వ విప్, పేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవిష్కరించారు. ఉదయభాను నివాసంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం పట్టణ అధ్యక్షుడు, అయోధ్య రామమందిరం ఆర్యవైశ్య అన్నదాన కమిటీ బోర్డు డైరెక్టర్ చారుగుండ్ల కొండ రాముని జెండాలను తీసుకువచ్చి ఉదయభానుకు అందజేశారు. అనంతరం ఉదయభాను ఆ జెండాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ జెండాలను ప్రతి ఒక్కరూ తమ ఇంటిమీద ఎగురవేసి ఆ అయోధ్య రాముని ఆశీస్సులు పొందాలని ఆకాంక్షించారు. కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు గింజుపల్లి శ్రీను, మాదల వీరయ్యచౌదరి, గెల్లా పూర్ణచంద్రరావు, తన్నీరు నాగేంద్ర, శేషంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోడలపై జైశ్రీరామ్ స్టిక్కర్లు..

ముండ్లపాడు(పెనుగంచిప్రోలు): అయోధ్యలో శ్రీరామ మందిరం ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ముండ్లపాడులో సర్పంచి గూడపాటి లావణ్య ఆధ్వర్యంలో సొంత నిధులతో గోడలపై జైశ్రీరామ్ స్టిక్కర్లు వేయించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గూడపాటి రవికుమార్, వైస్ ఎంపీపీ గుంటుపల్లి వాసు, మాజీ ఎంపీపీ గూడపాటి శ్రీనివాసరావు, ఉపసర్పంచి గుత్తా శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.



అయోధ్య రాముని జెండాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నాయకులు



ముండ్లపాడులో జైశ్రీరామ్ స్టిక్కర్లు అంటిస్తున్న గ్రామస్తులు

జోరుగా రాములోరి జెండాల విక్రయాలు

నందిగామ: పట్టణంలో రాములోరి జెండాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయోధ్యలో రామమందిర ప్రతిష్ఠ నేపథ్యంలో ప్రతి ఇంటిపైన రాములోరి జెండా రెపరెపలాడాలని ఇచ్చిన పిలుపు నేపథ్యంలో నందిగామ పట్టణంలో పలు ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో జెండాలు పంపిణీ చేశారు. ఈనేపథ్యంలో పలు డిజైన్లలో రూపొందించిన రాముడి జెండాల విక్రయాలు పట్టణంలో జోరుగా సాగుతున్నాయి. స్థానికులు ఎంతో ఆసక్తిగా రాములోరి జెండాలను కొనుగోలు చేస్తున్నారు.



నందిగామ పట్టణంలో ఏర్పాటు చేసిన రాములోరి జెండాలు, తోరణాలు

అయోధ్యలో బాలరాముడి విగ్రహం ప్రతిష్ఠను పురస్కరించుకుని గ్రామ గ్రామాన సందడి వాతావరణం కనిపిస్తుంది. ముఖ్యంగా ఆదివారం నందిగామ పట్టణంతోపాటు మండలంలోని ప్రతి గ్రామంలో ఇళ్లపైన రాములోరి జెండాలను ఏర్పాటు చేశారు. ప్రధాన వీధులను తోరణాలతో అందంగా అలంకరించారు. నందిగామ పట్టణంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. పట్టణంలోని మెయిన్ బజార్‌లో రామయాగం, పుష్పయాగం, సీతారాముల కల్యాణం, భారీ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అల్లూరులో అక్షింతలు పంపిణీ..

అల్లూరు(వీరులపాడు): అయోధ్య బాలరాముడి ప్రాణపత్రిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఆయా ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు, సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్రస్వామి సహిత మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ఆవరణలో బాలరాముడి విగ్రహ సంకీర్తన నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి అయోధ్య రాముడి పవిత్ర అక్షింతలను గ్రామస్తులకు పంపిణీ చేశారు. భక్తబృందం సభ్యులు దగ్గుల ఉమ, వెలది లక్ష్మి, ఆదిరాజు భవాని, అల్లూరి సీతారామమూర్తి, అమరలింగేశ్వరరావు, వేమిరెడ్డి లక్ష్మీనర్సిరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



అల్లూరులో ర్యాలీ చేస్తున్న రామభక్తులు



జగ్గయ్యపేటలో ఏర్పాటు చేసిన తోరణాలు

జెండాలతో తోరణాల ఏర్పాటు..

జగ్గయ్యపేట: అయోధ్య బాలరాముడి ప్రాణపత్రిష్ఠ మహోత్సవం నేపథ్యంలో జగ్గయ్యపేట పట్టణంతో పాటు గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. వీధులన్నీ బాలరాముడి జెండాలతో దర్శనమిస్తున్నాయి. జెండాలతో తోరణాలు కట్టారు. రామ్‌లల్లా ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో ఇళ్లపై శ్రీరాముని జెండాలను ఎగురవేస్తున్నారు. ఆయా ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలతోపాటు హనుమాన్ చాలీసా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

సెబ్ సీఐ, ఎస్ఐ బదిలీ

కంచికచర్ల : కంచికచర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కార్యాలయంలో సీఐగా పనిచేస్తున్న కె.కాత్యాయిని ఆదివారం బదిలీ అయ్యారు. రెండున్నరేళ్లుగా సీఐగా ఇక్కడ పనిచేస్తున్న కాత్యాయిని పశ్చిమ గోదావరి జిల్లా ఆకువీడుకు బదిలీకాగా, తాడేపల్లిగూడెం నుంచి బి.సత్యనారాయణ ఇక్కడికి బదిలీ అయ్యారు. సెబ్ ఎస్.బాలాజీ కాకినాడకు బదిలీకాగా, తూర్పుగోదావరి జిల్లా పెద్దాపురం నుంచి నాగేంద్రకృష్ణ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

187 మందికి వైద్యపరీక్షలు

నందిగామ: పట్టణంలోని రైతుపేట సత్యసాయి మందిరంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. హోమియో వైద్యుడు బొందలపాటి నరసింహారావు, ఆర్థోపెడిక్ వైద్యుడు శ్రీకాంత్ పాల్గొని 187మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు యు.వాసుదేవరావు, సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు



పోచంపల్లి(జగ్గయ్యపేట): ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోచంపల్లిలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని వీధుల వెంట ఉన్న చెత్తా చెదారాన్ని తొలగించారు. దోమల నియంత్రణకు మందులు పిచికారీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు బాలమురళీధర్, విజయప్రకాష్, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేద్కర్, గ్రామస్తులు పాల్గొన్నారు.







స్మృతి వనం..జన వనం

విజయవాడ స్వరాజ్ మైదానంలోని స్మృతివనం జనవనంగా మారుతోంది. స్వరాజ్ మైదానంలో రాష్ట్రానికే ఐకాన్‌గా నిలిచిన సామాజిక న్యాయ మహాశిల్పం బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల మహా విగ్రహాన్ని ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన స్మృతివనాన్ని ప్రారంభించారు. ఆ మరుసటి రోజు నుంచి సందర్శకులకు అనుమతిచ్చారు. వీటిని తిలకించేందుకు సందర్శకుల తాకిడి రోజు రోజుకూ పెరుగుతోంది. సెలవుదినం కావడంతో సందర్శకులు ఆదివారం పోటెత్తారు. పిల్లలు, పెద్దలు కుటుంబ సమేతంగా స్మృతివనాన్ని సందర్శించి ఆనందానుభూతి పొందుతున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ









మహిళల అభ్యున్నతికి జగనన్న కృషి

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తన పాలనలో మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ వారి అభ్యున్నతికి అనేక పథకాలు, కార్యక్రమాలను అమలుచేస్తున్నారని జగ్గయ్యపేట మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ కొనియాడారు. స్థానిక 26 వ వార్డులో రాజశేఖరరెడ్డి మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి హాజరైన వైస్ చైర్మన్ ప్రభాకర్ విజేతలకు బహుమతులను అందజేసి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా పక్షపాతి ఉంటూ ఇప్పటికే వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి వంటి పథకాల ద్వారా మహిళా సంక్షేమానికి కృషిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలుచేస్తూ డీబీటీ ద్వారా నేరుగా రూ.2.50లక్షల కోట్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే జమచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళా అభ్యున్నతే ధ్యేయంగా పాలన సాగిస్తున్న వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి అయ్యేందుకు రానున్న ఎన్నికల్లో మహిళలంతా ఆయనకు అండగా ఉండాలని కోరారు. పేట ఎమ్మెల్యేగా సామినేని ఉదయభానును మరోసారి ఆశీర్వాదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ హఫీజున్నీసా, మాజీ కౌన్సిలర్లు పద్మ, నాగమణి, సుధారాణి, హబీబా, రాజ్యలక్ష్మి, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మునిహేరా, మహిళా సమాఖ్య ప్రతినిధులు నరసమ్మ, సంతోషమ్మ, పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న తుమ్మల ప్రభాకర్, హఫీజున్నీసా, మాజీకౌన్సిలర్లు

ఘనంగా ఉప్పులూరి భారతీమాత జయంతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, బాలా త్రిపురసుందరి ఉపాసకురాలు ఉప్పులూరి భారతీమాత జయంతి వేడుకలు ఆదివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన సత్యనారాయణ పురం మారుతి గ్యాస్ కంపెనీ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఎస్ఎన్ఎల్ విశ్రాంత డీఈ ఉప్పులూరి లక్ష్మీనారాయణ పాల్గొని భారతీమాత సేవలను కొనియాడారు. అనంతరం లక్ష్మీనారాయణ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించి భారతీమాతకి అంకితం ఇచ్చారు. తొలుత సీహెచ్ మారుతిప్రసన్న జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కే రామ్మోహనరావు, నిట్ట సత్యనారాయణ, ట్రేడ్ యూనియన్ నేత టీవీ రమణమూర్తి, సంతోష్, డాక్టర్ బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు వసంతకుమార్, గుర్రం ఏడుకొండలు, కొండాయగుంట రాము, వి. విశ్వేశ్వరయ్య పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన సర్వే



పెనుగంచిప్రోలులో సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది, వలంటీర్లు

పెనుగంచిప్రోలు: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల పరిధిలో కుల గణన సర్వే చురుగ్గా సాగుతోంది. మూడో రోజు ఆదివారం కూడా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఇంట్లో కుటుంబ సభ్యుల కుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈసర్వేను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. మరో వారం రోజులపాటు ఈసర్వే జరుగుతుందని అధికారులు తెలిపారు.

కంచికచర్ల మండలంలో..

కంచికచర్ల : మండలంలోని అన్ని గ్రామసచివాలయాల పరిధిలో కులగణన సర్వే చురుగ్గా సాగుతోంది. గండేపల్లిలో సచివాలయ సిబ్బంది ఆదివారం సర్వే చేపట్టారు. గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి కుటుంబసభ్యుల వివరాలతోపాటు కులం పేరును ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. మండలంలో జరిగే కులగణన సర్వేకు ప్రజలంతా సహకరించాలని ఎంపీడీవో కె.శిల్ప కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జిల్లేపల్లి రత్నాకర్, మహిళా సంరక్షణ కార్యదర్శి రాణి, వలంటీర్ కోటయ్య పాల్గొన్నారు.



గండేపల్లిలో సర్వే చేస్తున్న కార్యదర్శి రత్నాకర్, రాణి తదితరులు

అన్నదానానికి విరాళాలు



రూ.50వేలను ఆలయ చైర్మన్ శ్రీనివాసరావుకు అందజేస్తున్న వెంకయ్య కుటుంబసభ్యులు



పాలకవర్గ సభ్యులకు విరాళాన్ని అందజేస్తున్న మార్కెండేయులు కుటుంబం

పెనుగంచిప్రోలు:గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ వారి కల్యాణం సందర్భంగా ఫిబ్రవరి 23న నిర్వహించే దీక్షాస్వాముల అన్నదానానికి సంబంధించి ఆదివారం గ్రామానికి చెందిన బరిగెల వెంకయ్య కుమారుడు నరసింహారావు, రూప దంపతులు రూ.50వేల విలువైన రెండు క్వింటాళ్ల కందిపప్పు, 9నూనె డబ్బాలకు సంబంధించిన నగదును ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. అలాగే బాపట్ల జిల్లా, వేమూరు మండలం, పెరవల్లి గ్రామానికి చెందిన గాజుల మార్కండేయులు, లక్ష్మీ తిరుపతమ్మ దంపతులు ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.15,116లు విరాళంగా అందజేశారు. ఈసందర్భంగా దాతలను ఆలయ అధికారులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీతిరుపతమ్మ ఆలయ పాలకవర్గ సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు, పొలాది వెంకటరమణ, కొలిపాక రాము తదితరులు పాల్గొన్నారు.

పథకాలపై ప్రజలకు అవగాహన



సంకల్పయాత్రలో పాల్గొన్న కమిషనర్ నాగమల్లేశ్వరరావు, అధికారులు

జగ్గయ్యపేట అర్బన్: స్థానిక ఉక్కు కళావేదికలో ఆదివారం జగ్గయ్యపేట పట్టణంలోని మూడు నుంచి తొమ్మిదవ సచివాలయాల పరిధికి సంబంధించి వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు అన్నెపాక శ్రీకాంత్, మన్నె శ్రీనివాసరావు, గోలి రాఘవేంద్ర, మున్సిపల్, హెల్త్, ఐసీడీఎస్, మెప్మా, హౌసింగ్ విభాల అధికారులు పాల్గొన్నారు.

నేడు 14వ సచివాలయం వద్ద..

స్థానిక ఎస్ఎస్‌పీ కాలనీలోని 14వ సచివాలయం వద్ద సోమవారం ఉదయం పదిగంటలకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు. కార్యక్రమానికి ప్రజలు హాజరుకావాలని ఆయన కోరారు.